క్లుప్తంగా

ఘనంగా లక్షతులసి పూజ



ఇసుకపూడిలో లక్షపత్రి పూజలో పాల్గొన్న మహిళలు

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి సామూహిక లక్ష తులసీ మహోత్సవాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సూర్యనమస్కారాలు, లక్ష తులసి పూజ, హోమాలు, సువాసినీ స్త్రీలతో అష్టోత్తర కలశలతో స్వామివారి గ్రామోత్సవం, తులసి ధంత్రిసమేత లక్ష్మీనారాయణస్వామి వారి పూజలను ఘనంగా జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు దీపోత్సవం, పూర్ణాహుతి, ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



మామిడికుదురు లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: గ్రామంలో కొలువుదీరిన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు చంద్రమౌళి భాస్కరం ఆధ్వర్యంలో ఈదరాడకు చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఈలి శ్రీనివాస్, మంగతాయారు దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వరునికి లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్రహోమం, తదితర పూజలను ఘనంగా జరిపించారు. పలువురు భక్తులు లక్ష బిల్వార్చనలో కర్తలుగా పాల్గొన్నారు.

కళాకారుని మృతికి సంతాపం



పురంధరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం గ్రామానికి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థలం కళాకారుడు పాటి పురందరరావు సంతాప సభ శనివారం జరిగింది. సీనియర్ రంగస్థల కళాకారుడు చొప్పల రామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు యాంత్ర మదన వీవీ సత్యనారాయణ, చవ్వాకుల సూర్యప్రకాశరావు, లంకె నాగేశ్వరరావు తదితరులు పురందరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు మాట్లాడుతూ బాలనాగమ్మ నాటకంలో పురందరరావు మాయల పకీరుగా చేసిన అభినయం ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కళాకారులు కుమిలి సూర్యప్రకాశరావు, కొంతేటి శాంతారావు, కడలి కృష్ణారావు, చిట్టి మహాలక్ష్మినాయుడు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

బెల్ట్ షాపులపై దాడి: ఇద్దరు అరెస్ట్

ఆలమూరు: ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో అనధికారికంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆలమూరు ఎక్సైజ్ సీఐ బీడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం చెముడులంకలోని స్థానిక బస్టాండ్ సమీపాన హైవే పక్కన ఒక షెడ్‌లో అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బెల్ట్ షాపును నడుపుతున్న ఎ.సీతారామయ్యను అరెస్ట్ చేశారు. అలాగే కపిలేశ్వరపురంలో బెల్ట్ షాపును ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్న ఎస్.తమ్మయ్యను శనివారం అరెస్టు చేసి అతని దగ్గర ఉన్న 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్సై పి.రాంబాబు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నదాన పథకానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. విశాఖపట్నానికి చెందిన పూజిత్ కార్తికేయ–నేహ రూ.10,116, ర్యాలి గ్రామానికి చెందిన కె.లక్ష్మి రూ.10 వేలు విలువ చేసే 105 గ్రాముల వెండి గిన్నెను బహూకరించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ ఆయన స్వామి వారి చిత్రపటం అందజేశారు.

బోదె కాదు.. పంట కాలువే

- శివారు ప్రాంతానికి అందని సాగునీరు
- రైతుల గోడు పట్టించుకోని అధికారులు



పినపళ్లలోని మురుగు కాలువ రోడ్డులో ఏర్పడిన భారీ గొయ్యి



పినపళ్లలోని పంట కాలువ స్వరూపం

ఆలమూరు: పారిశ్రామిక ప్రగతి చెందుతుందని ఆనంద పడాలో లేక రోజురోజుకూ రైతులు కష్టాల కడలిలో కూరుకుపోతున్నారని ఆవేదన చెందాలో తెలియని పరిస్థితి ఆలమూరు మండలంలోని పినపళ్లలో నెలకొంది. ఒకప్పుడు మురుగు (గొడ్డు) కాలువ రోడ్డుగా పిలువబడే ఓఎన్జీసీ లేదా పేపరు మిల్లు రోడ్డుగా రూపాంతరం సంతరించుకుంది. ఓఎన్జీసీ సహకారంతో ఇటీవల రూ.35 లక్షలతో గ్రావెల్ రోడ్డును తారు రోడ్డుగా ఆధునీకరించారు. అయితే ఓఎన్జీసీ అధికారుల నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత, ప్రజా ప్రతినిధులు ఉదాసీన వైఖరి వల్ల నిర్మించిన మూడు నెలలకే కుంగిపోయింది. అడుగడుగునా గోతులు పడి నడవడానికి సైతం భయపడే పరిస్థితికి ఆ రోడ్డు చేరింది. దీనిపై పలుమార్లు గ్రామస్తులు ఓఎన్జీసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డు దారుణ స్థితిలో ఉంది. అక్కడక్కడ ఈ రోడ్డు గోతులు పడి బెర్మ్‌లు జారిపోవడంతో పక్కనే ఉన్న పంట కాలువ కుదించుకుపోయింది. ఈపంట కాలువ వెంబడి పినపళ్ల, వల్లూరు గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో సాగునీరు అందక ఆ శివారు ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట తుది దశకు వచ్చిన తరువాత సాగునీరు అందక పంట దిగుబడి తగ్గుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ దుస్థితిని పట్టించుకునేదెవరూ?

పినపళ్లలోని ఎస్సీ ఏరియా నుంచి మురుగు కాలువ వరకూ సుమారు కిలోమీటర్ ఉన్న పంట కాలువ గతంలో సుమారు ఎనిమిది అడుగులు విస్తరించి ఉండేది. భారీ వాహనాల రాకపోకల పుణ్యమా అంటూ ప్రస్తుతం అడుగు మేరకు చేరింది. ఈ అడుగులో పారుతున్న సాగునీరు వందలాది ఎకరాలకు నీరు ఎలా అందిస్తుందన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. రైతులు తమలో తాము మదన పడటం తప్ప ప్రజా ప్రతినిధులను కాని, అధికారులను కాని ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. అలాగే పంట చేతి కొచ్చే సమయంతో కావడంతో పండించిన ఉత్పత్తులను ట్రాక్టర్ల ద్వారా తరలించవలసి ఉంటుంది. ఈరోడ్డు వెంబడి భారీగా ఉన్న గోతుల మధ్య లోడుతో కూడిన ట్రాక్టర్లు ప్రయాణించడం సాహసమే అవుతుందని రైతులు చెబుతున్నారు. ఆధునీకరించిన ఈ రోడ్డులో గోతులు ఏర్పడి నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు

పంట కాలువలు కుదించుకుపోయినా, రోడ్డు గోతులమయంగా మారినా భారీ వాహనాలు మాత్రం యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఆ రోడ్డుకు కనీసం మరమ్మతులు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులను కన్నీరు పెట్టించే ఈ పారిశ్రామిక ప్రగతి తమకు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు. ఓఎన్జీసీ, పేపరుమిల్లు, రైసుమిల్లు, ఇటుక బట్టీలు ఉన్నా కనీసం రోడ్డుకు గోతులను పూడ్చకపోవడం ఆ గ్రామ రైతులపై వారికి ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

రైతుల గోడు పట్టించుకోవడం లేదు



ప్రభుత్వాలు మారినా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా రైతులు గోడును పట్టించుకోవడం లేదు. పంట కాలువ మూసుకుపోతున్నా అధికారులు ఆ వైపు తొంగి చూడటం లేదు. దీనివల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

– కోట బూరయ్య, మాజీ సర్పంచ్, పినపళ్ల

శివారు ప్రాంతానికి నీరు అందడం లేదు



మురుగు కాలువ రోడ్డును నాసిరకంగా నిర్మించడం వల్ల బెర్మ్‌లు తరచూ కుంగిపోతున్నాయి. మట్టిబెడ్డలు జారిపోవడంతో పంట కాలువ రోజు రోజుకూ మూసుకుపోతుంది. గతంలో ఎనిమిది అడుగుల మేర ఉండాల్సిన పంట కాలువ కనీసం అడుగైనా ఉంటుంతో లేదో అనే అనుమానం ఏర్పడుతుంది.

– పిల్లి వెంకన్న, రైతు, పినపళ్ల

రబీ సీజన్‌కు పూర్తి స్థాయిలో పునరుద్ధరణ



రోడ్డు జారిపోవడం వల్ల మూసుకుపోయిన పంట కాలువను రాబోయే రబీ సీజన్ నాటికి పూర్తిస్థాయిలో ఆధునీకరించి పునరుద్ధరిస్తాం. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, అధికారులు పంట కాలువ పరిస్థితిని మా దృష్టికి తీసుకువచ్చారు. ఖరీఫ్ కోతలు ప్రారంభమైనందున సాగునీరు రైతులకు అంతగా అవసరం ఉండే అవకాశం లేదు.

– టి.కృష్ణత్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

పట్టభద్రుల ఓటు కోసం 2,250 దరఖాస్తులు

అంబాజీపేట: పట్టభద్రుల ఓటు హక్కు కోసం అంబాజీపేట మండలంలో మొత్తం 2,250 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకర్గ ఓటర్ జాబితా తయారీలో భాగంగా పట్టభద్రుల నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో 1,287 దరఖాస్తులు, ఆఫ్‌లైన్‌లో 963 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. ఈ దరఖాస్తులను పోలింగ్ బూత్‌ల వారీగా విభజించి బీఎల్వోల ద్వారా గ్రామాల్లోని పోలింగ్ బూత్ స్థాయిలో విచారణ చేయనున్నారన్నారు.

రహదారుల అభివృద్ధే లక్ష్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఉపయోగపడేలా సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు తెలిపారు. తొండవరంలో 9 ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో గ్రామంలోని 9 ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని సర్పంచ్ వివరించారు.

మలికిపురం ఏపీఎంగా నాగరాజు

మలికిపురం: మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం)గా డి.నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకర ప్రసాద్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన వరాలబాబు మామిడికుదురు బదిలీ కావడంతో నాగరాజును మలికిపురం మండలానికి ఏపీఎంగా నియమించారు.

ఓటుకు దరఖాస్తు చేసుకోండి

అంబాజీపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేయనున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. మండలంలో ఉన్న 53 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పేరు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు.

కోకో పార్కు ఏర్పాటుకు సహకరించాలి

మలికిపురం: సముద్రతీర గ్రామాల్లో కోకోపార్కు ఏర్పాటుకు సొసైటీ పాలకవర్గాలు సహకరించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం సీసీఎఫ్ సొసైటీ కార్యాలయం వద్ద జరిగిన మహాజన సభ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక పార్కుల విధానం, కేంద్ర ప్రభుత్వం సహకారం జోడించి ఎంఎస్ ఎంఈ పార్క్ తూర్పుపాలెంలో ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నాన్నారు. ఈ పార్కు రావడం ద్వారా కొబ్బరికాయకు మంచి గిట్టుబాటు ధర వస్తుందని, యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని, అన్ని విధాలా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. దీనికి మీ అందరి సహకారం కావాలని సూచించారు. నల్లి సత్యం, నల్లి దాసు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందూ సంస్థలకు అప్పగించాలి

కొత్తపేట: దేశ వ్యాప్తంగా హిందూ దేవాలయాల నిర్వహణను హిందూ సంస్థలకు అప్పగించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టినట్టు ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సంఘ చాలక్ ఎన్.హరికుమార్‌రెడ్డి తెలిపారు. వచ్చే జనవరి 5న విజయవాడ (గన్నవరం విమానాశ్రయం సమీపాన) హైందవ శంఖారావం పేరిట లక్షలాది మందితో రాష్ట్ర స్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సభ ప్రచార పర్యటనలో భాగంగా హరికుమార్‌రెడ్డి శనివారం కొత్తపేటలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ శిల్పశాలను సందర్శించారు. ఆయన శిల్పశాలలో విగ్రహాలను పరిశీలించి, అన్ని విగ్రహాల్లోనూ జీవ కళ ఉట్టి పడుతుందన్నారు. సజీవ శిల్పాల రూపకల్పనలో మీకు మీరే సాటి అని అభినందించారు. కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో హిందువులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి పి.జయప్రకాష్ నారాయణ, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ తోరం భాస్కరరావు, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు మద్దింశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పీఎంఎంఎస్ఏను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో శనివారం సుమారు 138 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

అలాగే లాబ్ టెక్నీషియన్ల నేతృత్వంలో రక్త పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పలు చట్టాలు



అంబాజీపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: మహిళలకు రక్షణగా అనేక చట్టాలున్నాయని అపరిచితుల బారిన పడి మోసపోవద్దని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు మహిళా సంరక్షణ కార్యక్రమాన్ని హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ నేటి సమాజంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ మాయాజాలంతో కొంత మంది మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల సైబర్ నేరగాళ్లు ప్రజలను సులువుగా మోసం చేస్తున్నారన్నారు. టెక్నాలజీని విద్య, ప్రాపంచిక విషయాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ఆపద సమయంలో పోలీసు సాయం కరోసం డయల్ 112కు ఫోన్‌లో సమాచారం ఇస్తే 10 నిమిషాల్లో భద్రత కల్పిస్తామన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు కె.శ్రీదుర్గ, ఆర్ఎస్ఎల్ భవానీ, పి.మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం



సఖినేటిపల్లిలంక సత్యసాయి ఆలయ ప్రాంగణంలో టైలరింగ్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో సభ్యులు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామంలోని సత్యసాయి ఆలయ ప్రాంగణంలో శనివారం మహిళలకు మూడు నెలల ఉచిత టైలరింగ్(కుట్టు) శిక్షణ శిబిరం ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీ, సత్యసాయి ఆర్గనైజేషన్, విశాఖపట్నం, మలికిపురం రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేశాయి. సుమారు 18 నుంచి 50 సంవత్సరాలు లోపు వయసున్న 50 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. శిబిరాన్ని రోటరీ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఉగ్గిన శ్రీనివాసరావు, మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు బత్తుల ఝాన్సీ లక్ష్మీబాయి ప్రారంభించారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, సత్యసాయి సేవాసమితి సభ్యులు డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, ఎంఎస్ వెంకటేశ్వరరావు, కె.ప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి తదితర విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

అంతర్వేదిలో భక్తుల సందడి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధికి కార్తిక మాసం రెండో శనివారం సాధారణ భక్తులు, అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనంలో వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలో దేవస్థానం భక్తులకు మంచినీటి సదుపాయం కల్పించింది. ఆలయంలోని నారసింహ సుదర్శన హోమంలోనూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామి సన్నిధికి తరలివచ్చిన వారికి నిత్యాన్నదానంలో భోజన వసతికి దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకుంది.

కొత్తపేటలో కోడ్ కొండెక్కింది

- 7 నుంచి కోడ్ అమలు
- అధికారులకు కనిపించని కూటమి నేతల ఫ్లెక్సీలు



కొత్తపేటలో టీడీపీ నేతల ఫ్లెక్సీ

కొత్తపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చినా కూటమి నాయకుల ఫ్లెక్సీలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. శాసనమండలిలో ఖాళీ అయిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. దానిలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈ నెల 7న షెడ్యూల్ కూడా విడుదలైంది. ఆరోజు నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. వెంటనే రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించాల్సి వుంది. కానీ అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నియోజకవర్గ కేంద్రం కొత్తపేట మండలంలో ఎక్కడికక్కడే వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ప్రధానంగా టీడీపీ కూటమి పాలకులు, నాయకులు ఫొటోలతో పబ్లిసిటీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. దాంతో కోడ్ అమలులో లేదా? ఉన్నా ఫ్లెక్సీలు అధికారులకు కనిపించడం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై ఒక రెవెన్యూ అధికారిని ప్రశ్నించగా నీళ్లు నములుతూ పంచాయతీలు తొలగించాలని అన్నారు.

తాగునీటి వ్యవస్థ పూర్తి స్థాయిలో ఆధునీకరణ



కత్తిమండలో తాగునీటి ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో తాగునీటి వ్యవస్థను పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కతిమండలో ఓఎన్జీసీ నుంచి రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన 40 వేల లీటర్ల తాగునీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పూర్తిగా ఉప్పు నీటిమయమైన రాజోలు దీవిలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. చాలా కాలం క్రితం వేసిన పైప్‌లైన్లు కూడా పాడై పోయాయని వాటిని కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే జల్‌జీవన్ నిధులతో గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి పైప్‌లైన్ల పనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే వేసవి నాటికి ఇంటింటికీ తాగునీటి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ చిట్టాల శ్రీనివాస్, బోనం సాయి, గెడ్డం మహాలక్ష్మప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో సుఖప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవించిన మహాలక్ష్మితో ఈఎంటీ స్పందన

సఖినేటిపల్లి: పురుటినొప్పులతో ఉన్న మహిళను 108 అంబులెన్స్‌లో స్టాఫ్ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గంమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే సిబ్బంది చాకచక్యంతో అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. మండలంలోని అప్పనరామునిలంకకు చెందిన కృపా మహాలక్ష్మి శనివారం పురుటినొప్పులు పడుతుండడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన చేరుకున్న సిబ్బంది, ఆసుపత్రికి ఆమెను తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ రాపాక స్పందన పరీక్ష చేయగా, డెలివరీ అయ్యే అవకాశం ఉందని గ్రహించి, అప్రమత్తమై చాకచక్యంగా అంబులెన్స్‌లో డెలివరీ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు, మెరుగైన వైద్యం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఈఎంటీ స్పందన, పైలట్ నగేష్ మీడియాకు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు అదే గ్రామానికి చెందిన పాటి త్రిమూర్తులు, అతని కుటుంబ సభ్యులు శనివారం రూ.50,500 విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు స్వామి వారి ప్రత్యేక దర్శనం అందించారు. స్వామి వారి వేద ఆశీర్వచనం అందజేశారు. త్రిమూర్తులును శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేయడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న చింతా రాజబాబు

మలికిపురం: రాష్ట్రంలో కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేయడం సరికాదని రాజోలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు మలికిపురం పూలే-అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలల న్యాయపోరాట సమితి నాలుగు మండలాల జేఏసీ అధ్యక్షులు చింతా రాజబాబు అధ్యక్షతన మాలల అత్యవసర సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేసి ఎస్సీల్లో ఏ కులం ఎంత జనాభా ఉందో తేల్చిన తర్వాతే ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ వేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల మురళీకృష్ణ, గెడ్డం తులసీభాస్కర్, తోటే ప్రతాప్, గెడ్డం పిలుఫ్ రాజు, నల్లి శివకుమార్, తాడి సహదేవ్, మందపాటి మధు, గొల్ల మార్టిన్, నల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు



పి.గన్నవరంలో అధికారులు నిలిపివేసిన ఇసుక ట్రాక్టర్లు

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు దిగువన వశిష్ఠ నదీపాయలో శనివారం నిబంధనలకు విరుద్ధంగా పడవలపై అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఈప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న నేపథ్యంలో పడవలపై ఇసుక తవ్వకాలు నిర్వహించకూడదు. ఆ నిబంధనను ఉల్లంఘిస్తూ శనివారం పడవలపై ఇసుకను తీసి ట్రాక్టర్లపై లోడు చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న అధికారులు ఆ లోడు ట్రాక్టర్లను సాయంత్రం వరకూ నిలిపివేశారు. పి.గన్నవరంలో పడవలపై నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తీయడంతో బోట్స్‌మన్ సొసైటీ ర్యాంపును నిలిపివేసినట్టు తహసీల్దార్ శ్రీపల్లవి విలేకరులకు తెలిపారు.